## కాఫీ బ్రేక్ స్టోరీ

**బెం**గుళూరు నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ డీలక్స్ బస్సు వేగంగా రోడ్డు ప్రక్కన గల చెట్లను దాటుకుంటూపోతోంది.

అది రాత్రివేళ కావటంతో ప్రయాణికులందరూ జోగుతూ కూర్చుని వున్నారు. కాని సౌజన్య మాత్రం తన సీటులో కూర్చుని దీర్ఘాలోచనాముద్రితయై వుంది. ఆమెకు తోడుగా వస్తున్న ఆమె తల్లిదండ్రులు కూడా కునికిపాట్లు పడుతున్నారు.

సౌజన్య కళ్ళు కిటికీగుండా బయటి దృశ్యాలను చూస్తున్నా మనస్సు మాత్రం జరిగిపోయిన తన గత జీవితంలోని దుస్సంఘటనల చుట్టూ పరిభ్రమిస్తోంది-

ఆమెకి తెలియకుండానే రెండు కన్నీటి చుక్కలు ఆమె కంటి చివరన నిలిచాయి.

రేపు తనకు ఎదురవబోయున్న అగ్నిపరీక్షలో తనకు గెలుపు లభిస్తుందా?

తనను కన్న నేరానికి రేపు తన తండ్రికీ, తల్లికీ కూడా అగ్నిపరీక్షే. ఈ అగ్ని పరీక్ష లేదా అగ్ని ప్రవేశం నిర్వహిస్తున్నది ఎవరో కాదు సాక్షాత్తూ తన భర్తే.

చెయ్యని నేరానికి శిక్ష అనుభవించాలన్నది అతని షరతు.

తన భర్తని తలచుకుంటుంటే అసహ్యం - ద్వేషం - కోపం రగిలిపోసాగినాయి.

తన మౌనాన్ని - ఓర్పుని - సహనాన్ని - మంచితనాన్ని ఆసరా చేసుకుని ఎన్నివిధాలా హింసించాలో అన్ని విధాలా హింసిస్తున్నాడు. అందరి ఆడపిల్లల్లాగే భవిష్యత్తు గురించిన ఎన్నో అందమైన కమ్మని కలలతో మరెన్నో మధుర భావనలతో వైవాహిక జీవితంలో అడుగు పెట్టింది.

అందము - విద్య - గొప్ప ఉద్యోగం కలిగిన భర్త లభించడం ఎంత అదృష్టము?

అందుకే ఆనాడు అందరూ సౌజన్యను అదృష్టవంతురాలు అన్నారు.

తన వాక్చాతుర్యంతో పరాయి స్త్రీలను ఆకట్టుకోవడంలో దిట్ట.

అదే ఆమెకు మిక్కిలి అసహ్యాన్ని కలిగించే విషయం.

బయటి స్త్రీలను నవ్వించగలిగే మగవాడు ఎప్పుడూ ఇంట్లో భార్యని విషాదానికి గురిచేస్తాడన్న విషయం నిజమయింది.

ఇంట్లో పనిమనిషికంటే హీనమైనది నీ స్థానం అని అవమానిస్తుంటే కన్నీళ్ళని గుండెల్లోనే దాచుకుంది తప్ప పెదవి విప్పలేదు.

ఒక వేశ్యకంటే నీ జీవితం ఉన్నతమైనది కాదని కర్కశంగా పలుకుతుంటే ముళ్ళు తిరుగుతున్న బాధని కడుపులోనే దాచుకుంది.

తన కన్నవాళ్ళని అకారణంగా దూషిస్తుంటే చాటుగా వెళ్ళి గుండెలు పగిలేలా ఏడ్చింది తప్ప అతనిని ఇదేమిటని ప్రశ్నించలేదు.

చదువు నేర్పిన సంస్కారం - భవిష్యత్తుపై ఏదో ఆశ ఆమెని మాట్లాడనివ్వలేదు.

అతని అహంకారానికి - ఆవేశానికి - కోపానికి - రోషానికి బలయిపోతూ రోజులు వెళ్ళదీయసాగింది.

అతని హింసల తాలూకు వాతలు తన శరీరం అంతటా తేలుతుంటే బాధని దిగమింగుకుని కిమ్మనకుండా సంసారం చెయ్యసాగింది.


అతని అవసరాలకు అనుగుణంగా మారిన క్షణాలకు ఫలితంగా కలిగిన పిల్లల క్షేమం దృష్ట్యా ముందు దారి కనిపించలేదు. కాని ఒక రోజు అకారణంగా తనని ఇంట్లో నుంచి వెళ్ళగొడ్తుంటే భరించడం ఆమె తరం కాలేదు.

తన మనసులో జరిగిన ఘర్షణ సంఘర్షణ పిమ్మట తన తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళిపోవడానికే నిశ్చయించుకుంది.

ప్రక్కింటి అమ్మాయిని చూస్తూ వెధవ్వేషాలను వేస్తుండగా - అది ఆమె కళ్ళబడటమే ఆమె చేసిన నేరం. తన బలహీనతపై ఆమె దృష్టి నిలవటం సహించలేకపోయాడు. భార్యని - ఇద్దరు పిల్లలను నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటేశాడు.

పువ్వులాంటి పిల్ల వడిలిపోయి - కృశించి పోయి - ఇంటికి చేరటం ఆ తల్లిదండ్రులను ఎంతో బాధకి గురిచేసింది.

నాలుగు రోజులు ఆ ఇంట్లో నిశ్శబ్దం రాజ్యమేలింది.



మొగుడితో పోట్లాడి అలిగి వచ్చిందని చాలా మంది ఆమెని బుజ్జగించబోయారు.

"మగవాడు కోపంలో ఏదో అనివుండవచ్చు. అంత మాత్రానికే ఇల్లు వదిలి వచ్చేయటమేనా? పాపం. నువ్వు లేక అతను ఎన్ని అవస్థలు పడుతున్నాడో" ఇదీ తోటి మహిళల ఉచిత సలహా.

"భర్త తిడితే, కొడితే పడివుండే రోజులు పోయాయి. అతని నుంచి విడాకులు తీసుకుని కోర్టు ద్వారా మనోవర్తి పొంది నువ్వు మరో దారి చూసుకో" ఇది కొత్తతరం వారి మరో ఉచిత సలహా.

కాని సౌజన్యకు ఎటూ పాలుపోవటం లేదు. ఆమె పరిస్థితి అగమ్యగోచరంగా వుంది.

రోజులు గడిచిపోతున్నాయి.

కనీసం అతను తన కన్నపిల్లలను చూడటానికయినా రాలేదు.

తిరిగి రమ్మని కబురు పంపలేదు.

ఆమె కన్నీళ్ళతోనే కాలం గడపసాగింది.

ఇదంతా చూసిన ఆమె తల్లిదండ్రులకు ఆమె కాపురం గురించి దిగులు పట్టుకుంది.

అల్లుణ్ణి రమ్మంటూ ఎన్నో ఉత్తరాలు వ్రాశారు. వాటికి జవాబు లేదు.

చివరికి సౌజన్య కుటుంబానికి సన్నిహితుడయిన ఒక వ్యక్తి అతని దగ్గరికి మధ్యవర్తిగా వెళ్ళాడు.

అతనితో సౌజన్య భర్త భార్య తప్పుల పట్టికను చదివి ఆమెకు తన భార్యగా వుండగలిగే అర్హత లేదని తేల్చి చెప్పేశాడు. మధ్యవర్తిగా వెళ్ళినవాడు అతనికి ఎన్నో విధాలుగా నచ్చచెప్పగా చివరికి అతను దయతలచి ఓ షరతు విధించాడట. తన భార్య తిరిగి వచ్చి తన కాళ్ళ మీద పడి క్షమాపణ వేడుకుంటే అప్పుడు ఆమెని ఏలుకుంటాడట. తిరిగి తన ఇంట్లో స్థానం కల్పిస్తాడట.

అది విని సౌజన్య ఆవేశంతో ఉడికిపోయింది.

"ఎందుకు నేను అతనిని క్షమాపణలు అడగాలి. అసలు నేను ఏ తప్పు చెయ్యకనే ఎందుకు అతని ఎదుట తల ఒగ్గాలి" అని తీవ్రంగా అడిగింది.

దానికి ఆమె తండ్రి "ఎంతయినా మేము పిల్లనిచ్చుకున్నవాళ్ళం తల్లీ. నేనూ, మీ అమ్మా నిన్ను మీ ఆయన దగ్గర దిగవిడిచి వస్తాము" అన్నాడు.

అది విని సౌజన్యలోని మనోస్థయిర్యం సడిలిపోయింది.

పురుషాధిక్య ప్రపంచంలో ఎవరి వల్ల లోపం జరిగినా అంతా ఇల్లాలిదే తప్పంటారు.

ప్రస్తుతం ఈ ప్రయాణానికి కారణం కూడా అదే.

సౌజన్యకు తరతరాలుగా తనింట్లో జరుగుతున్న తతంగం గుర్తుకొచ్చింది.

ఆమె బాల్యంలో సరిగ్గా ఇలాంటి సంఘటనే జరిగింది. ఆమె భర్తని పిలిపించి ఆమెచేత క్షమాభిక్ష పెట్టమని అడిగించారు.

ఆనాటి సంఘటన ఇంకా ఆమె హృదయంలో ముద్రించుకుపోయింది.

సరిగ్గా అలాంటి సంఘటనే తనకు ఎదురుపడుతుందని ఊహించలేకపోయింది.

తనకి అందం లేదా? చదువు లేదా? తెలివితేటలు లేవా? మరెందుకు తన భర్త ఇంత హీనంగా చూస్తున్నాడు?

అలా ఆలోచనా ప్రపంచంలో మునిగిపోయిన సౌజన్య బస్సు గమ్యం చేరడం గమనించలేకపోయింది.

* * *

తను కాపురం చేసిన ఇంట్లోనే పరాయిదానిలా కూర్చుని — ఏదో ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న వేళ అది.

తన భర్త ఏర్పాటుచేసిన న్యాయస్థానం అది. లేదా బలిపీఠం అంటే బాగుంటుందేమో.

ఆ బలిపీఠానికి బలి అయ్యే బలిపశువులా లేదా ఓ ముద్దాయిలా మౌనంగా తలొంచుకుని కూర్చుండిపోయింది.

భర్త తన చిన్న చిన్న తప్పుల్ని సైతం భూతద్దంలోంచి చూపిస్తూ దూషిస్తుంటే ఓ ప్రేక్షకురాలిలా చూస్తుండిపోయింది.

అక్కడ చేరినవారందరూ తనను దోషిలా చూస్తుంటే తల వొంచుకుని కూర్చుండిపోయింది.

ఆమెకు తెల్సు — తను నోరు విప్పి అతని నిరంకుశత్వాన్ని, విచ్చలవిడితనాన్ని, అహంకారాన్ని — దుష్ప్రవర్తనను వెల్లడి చేసిందంటే అతను దేనికి కొరగాడుకాడని —

ఇక క్షమాపణలు — మన్నించడాలు —రాజీ పడటాలు పర్వం మొదలయ్యింది.

"అయిందేదో అయింది బాబు. ఇక నుంచి అమ్మాయి నువ్వు చెప్పినట్లు నడుచుకుంటుంది. ఈసారికి క్షమించేసి పిల్లని ఏలుకో" అంటూ అక్కడ చేరిన పెద్దవాళ్ళందరూ దేవుణ్ణి ప్రార్థించినట్లు ప్రార్థించారు. ఆమె కన్నవాళ్ళతో సహా.

"పో...వే... నీ భర్త కాళ్ళ మీద పడి క్షమాపణలు వేడుకో. ఆడదానికి భర్తలేని జీవితం శూన్యం. చావయినా, బ్రతుకయినా అతని తోడే లోకం..." ఇలా సాగిపోతోంది అమ్మలక్కల హితబోధనలు.

కాని సౌజన్య మాత్రం రాయిలా కూర్చుండిపోయింది.

"ఏమిటే బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నావ్ లే. నీ భర్త పాదాల చెంతే నీ జీవితం. భర్తే దైవ స్వరూపం...

కొట్టినట్లు అన్నది మరొక ఆవిడ.

సౌజన్యలో మెల్లగా చలనం కలిగింది.

ఒకసారి అక్కడ కూర్చున్న వారందరి వంక అదోలా చూసింది.

తరువాత లేచి నిలబడింది.

పురుషాహంకారం అణువణువునా జీర్ణించుకున్న అతను విజయగర్వంతో — నిస్సహాయురాలయిన తన భార్య తన కాళ్ళ మీదపడి క్షమాపణ అడగటమే తరువాయి అన్నట్లు నిర్లక్ష్యంగా ఎటో చూస్తూ కూర్చున్నాడు.

అతనిని సమీపించిన సౌజన్య అతనిని ఉద్దేశిస్తూ "ఒకసారి లేచి నిలబడతారా" అని అడిగింది.

అమ్మలక్కలందరూ అదేదో తమాషా జరుగుతున్నట్లు ఆ సన్నివేశాన్ని ఎంతో ఉత్కంఠతతో తిలకించసాగారు.

అతను లేచి నిలబడగానే — తనలోని శక్తి నంతటిని చేతిలోకి కూడదీసుకుని ఈడ్చి అతని చెంపపై కొట్టింది.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి అక్కడివారు బిత్తరపోయారు.

చెంపపై దెబ్బ బలంగా తగిలింది కాబోలు కళ్ళు బైర్లు కమ్మి ఆమె కాళ్ళ వద్ద బోర్లాపడ్డాడు అతను.

"నాతో సంసారం చెయ్యటానికి ఇతను సిద్ధంగా వున్నా నేను మాత్రం సిద్ధంగా లేను — వివాహ బంధంలోని ఆంతర్యం... అర్థాంగి విలువ తెలియని ఈ మూర్ఖుడితో సంసారం చెయ్యటం ఒక పశువుతో సంసారం చేసిన దానితో సమానం... నాకు చదువు వుంది... ఒంట్లో శక్తి వుంది. నా బ్రతుకు నేను బ్రతకగలను. ఆవేశంతోనూ — ఆగ్రహంతోనూ ఒళ్ళు కంపిస్తుండగా చెప్పింది సౌజన్య. తరువాత ఇద్దరు పిల్లలను చెరొక చేత్తో పట్టుకుని బయటికి నడిచింది ఆదిశక్తిలా.

తను తన పిల్లలను సర్వశక్తులు ధారపోసి పెంచుకుంటుంది. ఆమెలో ఆత్మస్థయిర్యం ఇనుమడించింది. — షహనాజ్

**'ఇది తెలుసా?'**

ద్రవ రూపంలో వున్న లోహం 'పాదరసం'.

— శ్రీనుబాబు, నగరం